క్లుప్తంగా

అమావాస్య అన్నదానం ప్రారంభం

యర్రగొండపాలెం: స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద శుక్రవారం అమావాస్య అన్న సంతార్పణం కార్యక్రమాన్ని అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజు దేశ్‌పాండే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాలకంటే అన్నదానం గొప్పదని, పేదల కడుపు నింపితే భగవంతుడి ఆశీస్సులు పొందిన వారవుతారన్నారు. ప్రతి నెలా అమావాస్య అన్న సంతార్పణం చేసేందుకు ప్రారంభంలో కిలో బియ్యం పులిహోరతో ప్రారంభించడం జరిగిందని, ఈ రోజు లక్షలాది మంది కడుపు నింపుతున్నారని పేర్కొన్నారు. అన్నదానం చేసిన యెలిశెట్టి సంజీవరావు దంపతులకు ఆయన శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. వేణుగోపాలస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ యక్కలి భాగ్యారావు, గ్రంథిశిల సూర్యం, కందూరి కాశీనాథ్, చిలకల అంకిరెడ్డి పాల్గొన్నారు.

కొనకనమిట్ల తహసీల్దార్‌గా షాజీదా

కొనకనమిట్ల: స్థానిక రెవెన్యూ కార్యాయలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న షాజీదా పూర్తి బాధ్యతలతో శుక్రవారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు మండల తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన బీఆర్‌ఎల్‌వీ ప్రసాద్ సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో డీటీ షాజీదాకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. నూతన తహసీల్దార్‌ను రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు మర్యాపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

షెడ్యూల్ కులాల అధ్యక్షురాలిగా సుశీల



దర్శి: షెడ్యూల్ కులాల కుల పరిరక్షణ సొసైటీ జిల్లా అధ్యక్షురాలిగా జాలా సుశీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కాటమల చెన్నకేశవరావు నియామక పత్రాన్ని శుక్రవారం అందజేశారు. సుశీల మాట్లాడుతూ దళిత మహిళల సమస్యలు, హక్కులు కోసం పోరాడుతానన్నారు.

దేశం గర్వించదగిన ఇంజినీర్ విశ్వేశ్వరయ్య

బేస్తవారిపేట: ప్రఖ్యాత ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య భారతదేశం గర్వించదగిన ఇంజినీర్ అని జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య అన్నారు. ఇంజినీర్స్ డే సందర్భంగా శుక్రవారం మండలంలోని మోక్షగుండంలో విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేశారు. ఇంజినీరింగ్‌లో, విద్యారంగంలో విశ్వేశ్వరయ్య చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆధునిక భారతదేశంలో ఆనకట్టలు, రిజర్వాయర్లు, హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల నిర్మాణంలో అసమాన ప్రతిభతో దేశానికి ఎన్నో సేవలు అందించారన్నారు. ప్రపంచ మేధావి మన ప్రాంతానికి చెందిన వాడు కావడం జిల్లాకే గర్వకారణమన్నారు. మార్కాపురం పంచాయతీరాజ్‌శాఖ ఈఈ వై.రమేష్‌బాబు, గిద్దలూరు డీఈ వరప్రసాదరావు, బేస్తవారిపేట సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు బారెడ్డి వెంకటేశ్వర రెడ్డి, ఆరు మండలాలకు చెందిన పంచాయతీ రాజ్ ఏఈలు శ్రీనివాసనాయక్, ఆంజనేయరెడ్డి, వెంకటేశ్వరరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు. ఉత్తమ పనితీరు కనపరిచిన సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు ఇంజినీర్స్ డే సందర్భంగా సన్మానం చేశారు. నియోజకవర్గంలో ఆరు మండలాల్లోని 12 మందికి శాలువాలు, పూలమాలలతో అభినందించారు.



విశ్వేశ్వరయ్యకు నివాళులర్పిస్తున్న ఎస్ఈ కొండయ్య

ఆదర్శనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని పలు ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఇంజనీర్స్ డే గా ఘనంగా నిర్వహించారు. డాక్టర్ శ్యామ్యూల్ జార్జ్, కిట్స్, ఏ1 గ్లోబల్, వీహెచ్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. దేశానికే భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆదర్శంగా నిలిచారని జార్జ్ కళాశాలలో న్యూరో సైక్రియాటిస్టు డాక్టర్ ఖాజా మొహిద్దీన్, సైకాలజిస్టు డాక్టర్ వి సుబ్బారావు, ట్రాన్స్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినర్ టి.దివిజ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విశ్వేశ్వరయ్యను ఇంజినీరింగ్ విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కళాశాల కార్యదర్శి ఆదిమూలపు విశాల్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ రాజబాబు, అకడమిక్ డీన్ మస్తానయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

■ కిట్స్ కాళాశాలలో కళాశాల కరస్పాండెంట్ అన్నా కృష్ణచైతన్య ఆధ్వర్యంలో ఘనంగా ఇంజనీర్స్ డేను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి, కోఆర్డినేటర్ పీవీ అనిల్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

■ దేశ పురోభివృద్ధిలో ఇంజినీర్స్ పాత్ర ఎంతో కీలకమని వీహెచ్‌ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి అన్నారు. ఇందిరా ఇంజినీరింగ్ కళాశాలలో మోక్షగుండం విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెన్న ఇందిర, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషా ఈశ్వరన్, ఏఓ రవీంద్రారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

■ ఏ1 గ్లోబల్ కళాశాలలో చైర్మన్ మీర్జా షంషీర్ అలీబేగ్ మాట్లాడుతూ.. దేశానికి ఇంజినీర్లు వెన్నెముక అని అభివర్ణించారు. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, డైరెక్టర్ వీరసుదర్శన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మూడు మండలాల్లో విద్యుత్‌కు అంతరాయం

కంభం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 6 గంటల నుంచి 9.30 గంటల వరకు కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాల పరిధిలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ ఏడీ బాల అంకయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పాతకక్షల నేపథ్యంలో ఘర్షణ

మార్కాపురం రూరల్: పాత కక్షల నేపథ్యంలో ఇరువర్గాలు ఘర్షనపడిన సంఘటన మార్కాపురం మండల పరిధిలోని తర్లుపాడు రోడ్డులో ఆంజనేయస్వామి గుడి వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తర్లుపాడు మండలం సీతానాగులవరం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుకు చెందిన పొలంలో అనుమతి లేకుండా గడ్డికోసుకుంటున్న ఆంజనేయులుపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో ఆంజనేయులు మార్కాపురం జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మార్కాపురం రూరల్ ఎస్సై వెంకటేశ్వర నాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు విశ్వకర్మ జయంతి ఉత్సవాలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఈ నెల 17న విశ్వకర్మ భగవానుడి జయంతి మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు షరాబు దత్తాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు భక్తులకు అన్నదానం చేయనున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం చేయాలి

పుల్లలచెరువు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో మరియదాసు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని సచివాలయం-1,2 పరిధిలో ప్లకార్డులు చేపట్టి ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని అందులో భాగంగా నూతనంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై యాప్‌లో నమోదు చేస్తారన్నారు. వలంటీర్లు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం ఎంఎల్‌ఓ వాసు ఆధ్వర్యంలో సచివాలయం-2లో వలంటీర్లు, ఆశా, ఆరోగ్య, సచివాలయ సిబ్బందికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.శ్రీకృష్ణ తెలిపారు. మండలంలో తహసీల్దార్, ఎంపీడీఓ ఆధ్వర్యంలో రెండు టీమ్‌లుగా ఏర్పడి 15 రోజుల పాటు ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల సమాచారాన్ని ప్రజలకు తెలియజేస్తారన్నారు. అలాగే ప్రతి ఇంట్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి, టోకెన్లు మంజూరు చేయడంతోపాటు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తారన్నారు. ఈ నెల 30న మల్లవరం, అక్టోబర్ 3న కుంచేపల్లి, 5న పాములపాడు, 9న ఆముదాలపల్లి, 11న ఏలూరు, 13న కొండాయపాలెం, 17న సూదనగుంట, 19న తలమళ్లలో, అలాగే పొదిలి నగర పంచాయతీలో అక్టోబర్ 4వ తేదీన సచివాలయం-1 పరిధిలోని బాలికల ఉన్నత పాఠశాల, 6న సచివాలయం-2లో, 10న సచివాలయం-3లో, 12న సచివాలయం-4లో, 16న సచివాలయం-5, 18న సచివాలయం-6 కాటూరివారిపాలెం, 20న కంభాలపాడు, 21న మాదాలవారిపాలెంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

జగనన్న సురక్షను విజయవంతం చేయాలి

గిద్దలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అందరం కలిసికట్టుగా విజయవంతం చేయాలని కమిషనర్ వై.రామకృష్ణయ్య అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమంపై శుక్రవారం ఏఎన్ఎంలు, వలంటీర్లు, ఆశా కార్యకర్తలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జగనన్న సురక్షతో కలిగే ప్రయోజనాల గురించి అధికారులు ప్రజలకు వివరించాలన్నారు. ఆరోగ్య సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక బృందం పర్యటిస్తుందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించేందుకు ఈ కార్యక్రమం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. వైస్ చైర్మన్ ఆర్‌డీ రామకృష్ణ, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్

తర్లుపాడు: సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మీర్జపేట ఎంపీటీసీ సభ్యురాలు పార్వతీ రమేష్‌రెడ్డి కొనియాడారు. శుక్రవారం గ్రామ సచివాలయంలో నూతనంగా మంజూరైన 24 పింఛన్లను సర్పంచ్‌లు మీరయ్య, రామిరెడ్డితో కలిసి లబ్ధిదారులకు అందించారు. ఎంపీటీసీ మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో పింఛన్ల కోసం జన్మభూమి కమిటీల సిఫార్సులు అవసరమయ్యేవని, జగనన్న ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా ఇంటికే వెళ్లి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ సీహెచ్ మల్లారెడ్డి, పార్టీ నాయకులు వెలుగొండా రెడ్డి, కాశయ్య, డి.వెంకటరెడ్డి, బి.భాస్కర్‌రెడ్డి, శేషయ్య, గొల్లపల్లి వైస్ సర్పంచ్ కె.రామలక్ష్మమ్మ, నాయకులు ఉడుముల వెంకటరెడ్డి, ఉమ్మారెడ్డి తిరుపతిరెడ్డి, రమణమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మీర్జపేటలో లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్‌లు

సంక్షిప్తంగా

జగనన్న పాలనతో రాష్ట్రం సుభిక్షం

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు

రాచర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండలంలోని యడవల్లి సచివాలయం పరిధి అంకిరెడ్డిపల్లె, యడవల్లి గ్రామాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అంకిరెడ్డిపల్లె, యడవల్లి గ్రామాల్లో ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు వివరించారు. తొలుత యడవల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ అబ్దుల్ మునాఫ్ అరటి పండ్ల గజమాల క్రేన్ సాయంతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఆయా కుటుంబాలకు ఇప్పటి వరకూ అందిన సంక్షేమ పథకాలకు సంబంధించిన బుక్‌లెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు అడుగులు ముందుకేసి సంక్షమ పథకాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారని చెప్పారు. అధికారంలోకి రాక మునుపు ఏవైతే హామీలు ఇచ్చారో వాటన్నింటినీ ఇక వరుస క్రమంలో నవరత్నాలు పేరుతో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారని చెప్పారు. కులం, మతం, ప్రాంతం, వర్గం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అంతే పాదర్శకంగా అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. ఎంపీపీ షేక్ ఖాశింబీ, జెడ్పీటీసీ పగడాల దేవి, శ్రీరంగం, మడవల్లి ఎంపీటీసీ భవనం ధనమ్మ, మాజీ సర్పంచ్‌లు షేక్ మహబుబ్ బీ, బైర్ల లలితమ్మ, జేఏసీ మండల కన్వీనర్ బెల్లం నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ, రామాపురం సొసైటీ అధ్యక్షుడు మదిరె శ్రీరంగారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు భవనం కోటేశ్వర్‌రెడ్డి, ఉసా నారాయణ, సూర పాండురంగారెడ్డి, ఎంపీడీవో కె.కవితా చౌదరి, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



అరటిపండ్ల గజమాలతో ఎమ్మెల్యే అన్నాకు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గణేశ్ మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

పొదిలి: వినాయక విగ్రహాల ఏర్పాటుకు, ఉత్సవాల నిర్వహణకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ రాఘవేంద్ర తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో సీఐ మాట్లాడారు. విగ్రహ ఏర్పాటు నుంచి, నిమజ్జనం పూర్తయ్యే వరకు నిర్వాహకులదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు. విద్యుత్, మైక్ పర్మిషన్లు తీసుకోవడంతోపాటు అత్యవసర సర్వీసుల ఫోన్ నంబర్లు విగ్రహ వేదిక వద్ద అందుబాటులో ఉంచాలని సూచించారు. అశ్లీల, అసభ్యకర నృత్య ప్రదర్శన ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమజ్జన సమయంలో ఇతర మతాల వారిని కించపరిచే విధంగా ప్రసంగాలు చేయకూడదన్నారు. ఉత్సవాన్ని శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సీఐ కోరారు. పొదిలి, కొనకనమిట్ల ఎస్సైలు వెంకట సైదులు, బ్రహ్మనాయుడు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: వినాయక చవితి పండగ సందర్భంగా గిద్దలూరు సర్కిల్ పరిధిలో ఏర్పాటు చేసే మండపాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని స్థానిక సీఐ దేవప్రభాకర్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిద్దలూరు సర్కిల్ పరిధి రాచర్ల, కొమరోలు, గిద్దలూరు మండలాల్లో వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేసే మండపాలకు వాటికి సంబంధించిన కమిటీ సభ్యులు పోలీసుల అనుమతులు తీసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మార్కాపురం టౌన్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీఈఓ వీఎస్ సుబ్బారావుకు యూటీఎఫ్ నాయకులు మార్కాపురం ఎమ్మార్సీ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. బదిలీల సందర్భంగా ఏర్పడిన గ్యాప్ పీరియడ్ సమస్యను డీఈఓ దృష్టికి తెచ్చారు. పదోన్నతులు, రెగ్యులరైజేషన్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఓవీ వీరారెడ్డి, పట్టణ నాయకులు వినోద్, రామాంజనేయరెడ్డి, రంగనాథ్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళలకు గాయాలు

రాచర్ల: రోడ్డు ప్రమాదంలో మహిళలకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని చర్లోపల్లె సమీపంలోని హైవేపై శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. వివరాలు.. మండలంలోని గుడిమెట్ట పంచాయతీ పరిధి రామాపురం గ్రామానికి చెందిన అన్నపురెడ్డి వెంకట రంగారెడ్డి, ఆయన భార్య మహేశ్వరి, కూతురు స్నేహ ముగ్గురూ కలిసి మార్కాపురం నుంచి గిద్దలూరుకు టీవీఎస్ మోటారు సైకిల్‌పై వెళ్తున్నారు. ఆ సమయంలో గిద్దలూరు నుంచి కంభానికి వెళ్తున్న బులెరో వాహనం ప్రమాదవశాత్తు టీవీఎస్ మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. వెంకట రంగారెడ్డి, భార్య మహేశ్వరికి స్వల్పగాయాలు కాగా కూతురు స్నేహ తీవ్రంగా గాయపడటమే కాకుండా కుడి కాలు విరిగింది. వీరికి 108 వాహనంలో గిద్దలూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం స్నేహను నంద్యాల తరలించారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలంలోని రాయవరం గ్రామంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ వర్మీ కంపోస్టు తయారీ గురించి వివరించారు. షెడర్స్ ఉపయోగించి డ్రైవేషన్ చేపట్టి, దాని నుంచి వచ్చే చిప్స్‌ను వీలైనంత త్వరగా అమ్మాలని అధికారులకు సూచించారు. సర్పంచ్ కేశారపు భాగ్యమ్మ, డీఎల్‌డీఓ సాయికుమార్, మార్కాపురం డీఎల్‌పీఓ జి.నాగేశ్వరరావు, ఎంపీడీఓ నరసింహులు పాల్గొన్నారు.

మైనారిటీ హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడిగా సయ్యద్ బాబు

పెద్దదోర్నాల: మైనారిటీ హక్కుల పరిరక్షణ కమిటీ మండల అధ్యక్షుడిగా సయ్యద్ బాబు ఏకగ్రీవంగా ఎంపికైనట్లు మండల గౌరవ అధ్యక్షుడు పఠాన్ బషీర్‌ఖాన్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల ఉపాధ్యక్షుడిగా జనాబ్ అబ్దుల్ సమద్, సెక్రటరీగా జనాబ్ ఖాసిం, జాయింట్ సెక్రటరీగా జనాబ్ మహబూబ్‌బాషా, ట్రెజరర్‌గా జనాబ్ వాజిద్ ఏకగ్రీవంగా ఎంపికైనట్లు చెప్పారు. బాబు మాట్లాడుతూ కుల,మతాలకు అతీతంగా ప్రతి పేదవానికి ఆదుకోవడమే మైనారిటీ హక్కుల పరిరక్షణ కమిటీ లక్ష్యమన్నారు. తనను అధ్యక్షునిగా ఎంపిక చేసిన రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ఫారూక్ షిబ్లీ, ఉపాధ్యక్షులు నజీర్ అహ్మద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణపై అవగాహన ఉండాలి

గిద్దలూరు రూరల్: మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఇటుకల బట్టీల వద్ద శుక్రవారం కాలుష్య నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమంలో భాగంగా న్యాయవాదులు ఇటుకల బట్టీల తయారీదారులకు కాలుష్య నివారణ అంశాలపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు పోలయ్య, సిద్ధయ్య, కోర్టు వలంటీర్ మధు పాల్గొన్నారు.

గాంధీ, పొట్టిశ్రీరాములు విగ్రహాల ఆవిష్కరణ

గిద్దలూరు రూరల్: మండలంలోని ఉయ్యాలవాడలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ, పొట్టిశ్రీరాముల విగ్రహాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతిక్షణం ప్రజల సంక్షేమం కోసం పాటుపడిన మహనీయుల విగ్రహాలు గ్రామాల్లో ఉండటంతో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆవిష్కరించామని తెలిపారు. బీజేపీ నాయకులు భవనాశి రామాంజనేయులు, వాసవీ క్లబ్ నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

యర్రగొండపాలెం: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్న శాసనాల లలితను ఎంఈవో పి.ఆంజనేయులు, గురిజేపల్లి పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తూ నిత్యం విద్యాభివృద్ధికి పాటుపడుతున్న లలిత అందరికీ ఆదర్శం కావాలని ఎంఈవో కోరారు. ప్రస్తుతం విద్యావిధానంలో వచ్చిన మార్పులను అనుసరించి డిజిటల్ విధానంలో బోధన, ఆంగ్ల బోధనపై ప్రత్యేక కృషి, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు ఆమె విజయానికి సోపానాలన్నారు. అనంతరం పాఠశాలలో పుస్తక మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామీణ గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు. హెచ్ఎం ఎం.జాకోబ్, ఉపాధ్యాయులు నాగరాజు, ప్రభాకర్, అక్మీబాయి, సునీత, గురవమ్మ, మహేశ్వరి, సక్రీబాయి పాల్గొన్నారు.

పెద్దారవీడు: కలనూతల జెడ్పీహెచ్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు చీదెళ్ల లక్ష్మణరావుకు జిల్లా ఉత్తమ అవార్డు వచ్చిన సందర్భంగా శుక్రవారం ఆయన్ను పూలమాల, శాలువతో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. చీదెళ్ల లక్ష్మణరావు పాఠశాల అభివృద్ధి కోసం రూ.25 వేలు ఖర్చు పెట్టిన విషయం అందరికీ తెల్సిందేనని హెచ్ఎం పి.వెంకటరావు తెలిపారు. ఇక్కడ హెచ్ఎంగా పని చేసి బదిలీపై తర్లుపాడు జెడ్పీహెచ్ పాఠశాల హెచ్ఎం సుధాకర్, మండల ఉత్తమ ఉపాధ్యాయుడు బండారు నాగరాజులను సత్కరించారు. యూటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ శ్రీరాములు, ఉపాధ్యాయులు రామకృష్ణ, రామిరెడ్డి, మహేష్, మల్లికార్జున, కృష్ణారెడ్డి, మూర్తి, సులోచన, రమణారెడ్డి, ఏడుకొండలు పాల్గొన్నారు.

194 మందికి వైద్య పరీక్షలు

పెద్దారవీడు: బద్వీడు ప్రాథమికోన్నత పాఠశాలలో ఐటీడీఏ, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ జి.రవి పర్యవేక్షణలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఒంగోలుకు చెందిన అనీష్ కిడ్నీ సెంటర్, ఎంపీఎం ఆర్థోపెడిక్ వైద్యశాల డాక్టర్ వీరయ్యచౌదరి, డాక్టర్ కె.రామ్మోహనరావులు 194 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం చెంచు గిరిజనుల గర్భిణులకు ప్రోటీయన్ పౌడర్, ఐరన్ సిరప్‌లు ఉచితంగా పంపిణీ చేశారు. సర్పంచ్ కంచర్ల చెన్నమ్మ, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ టీం లీడర్ దీన హెప్సిబా, ఆరోగ్య మిత్రలు మందగిరి చంద్రశేఖర్, ఎం.శంభయ్య, హెచ్ఎం వి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండల కేంద్రం కొనకనమిట్లలో శుక్రవారం పొదిలిలోని ఉడుముల హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ ఉడుముల అశోక్‌రెడ్డి, డాక్టర్ ఎస్‌వీ గీతికా రెడ్డి పర్యవేక్షణలో ఆర్థోపెడిక్, జనరల్ మెడిషన్, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ జీవన్‌రెడ్డి, శ్రీనివాసులు, నీలా హారిక 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. తొలుత వైద్య శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసుల రెడ్డి ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేదలకు ఉడుముల హాస్పిటల్లో ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు.